క్లుప్తంగా

ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ పోస్టర్ విడుదల



పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడ: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 8న మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఫిష్‌ఫుడ్ ఫెస్టివల్ పోస్టర్‌ను ఎమ్మెల్యే రమేశ్‌బాబు తన నివాసంలో మంగళవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గోశాలకు రాజన్న కోడెలు



కోడెలను అప్పగిస్తున్న ఆలయ ఉద్యోగులు

వేములవాడఅర్బన్: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి గోశాల నుంచి 20 కోడెలను హన్మకొండ జిల్లా వేలూరు గ్రామంలో ఉన్న లక్ష్మీ గోశాలకు అప్పగించినట్లు ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ హరినాథ్ తెలిపారు. సీనియర్ రికార్డు అసిస్టెంట్లు శ్యామ్, శంకర్ పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ సిద్దోగం



వేడుకల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

ముస్తాబాద్: మండలంలోని చిప్పలపల్లిలో ఎల్లమ్మ సిద్దోగం వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న వేడుకల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్లమ్మ పట్నాలు వేశారు. ఎంపీపీ జనగామ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సర్పంచ్ జ్యోతి, మాజీ సర్పంచ్ దేవయ్య, గౌడ సంఘం నాయకులు స్వామిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రావణ్‌గౌడ్, రాజాగౌడ్, మల్లాగౌడ్, రాజలింగంగౌడ్ పాల్గొన్నారు.

కాలనీవాసుల ఆందోళన



కాలువ వద్ద కాలనీవాసులు

సిరిసిల్లఅర్బన్: తాత్కాలిక కచ్చా కాలువను ఏర్పాటు చేయడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని పట్టణంలోని శ్రీనగర్ కాలనీ వాసులు మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ గతంలో వర్షాకాలంలో వరదలు వచ్చినప్పుడు తాత్కాలికంగా కచ్చాకాలువను ఏర్పాటు చేశారని, దీనికి శాశ్వత పరిష్కారం చూపకుండా మళ్లీ మరమ్మతులు చేపడుతున్నారన్నారు. దీని వల్ల రాకపోకలకు, ఇళ్లలోకి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నామన్నారు. వచ్చేది వర్షాకాలం మళ్లీ కాలనీలోకి నీరు వచ్చే అవకాశముందని, శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఎన్నిసార్లు చెప్పిన తమ సమస్యను పట్టించుకోవడం లేదన్నారు. రాజేందర్, రమేశ్, దేవేందర్, మల్లేశం పాల్గొన్నారు.

ఉపాధి పండుగ

- ఏడు వేలకుపైగా జాబ్‌కార్డులు
- రోజుకు వేయి మంది కూలీలకు ఉపాధి
- ఫిష్ పాండ్స్, చెరువులో సిల్ట్ పనులు

బోయినపల్లి: ఈ వేసవిలో ఉపాధిహామీ పనులు ఊపందుకున్నాయి. మండలంలో 23 గ్రామాల్లో 7,608 మందికి జాబ్‌కార్డులుండగా, 21 గ్రామాల్లో సుమారు 4,594 మంది కూలీలు పనిచేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మిడ్‌మానేరు జలాశయంలో ముంపునకు గురైన కొదురుపాక, నీలోజిపల్లి, వరదవెల్లి మాన్వాడ గ్రామాల్లోని కూలీలకు సైతం ఉపాధి కల్పిస్తున్నారు.



విలాసాగర్‌లో ఫిష్‌పాండ్ పనులు

ఫిష్, పామ్ పాండ్స్

చేపల పెంపకం కోసం మర్లపేట, బూర్గుపల్లి, నర్సింగాపూర్, బోయినపల్లి, తడగొండ తదితర గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో ఫిష్ బ్రీడింగ్ పాండ్, అలాగే బోయినపల్లి, స్తంభంపల్లి చెరువులో పూడిక మట్టి తీసే పనులు చేస్తున్నారు. మండలంలోని 21 గ్రామాల్లో ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 2,119 కుటుంబాలు ఈ పనుల్లో పాలుపంచుకున్నట్లు అధికారులు తెలిపారు. గుండన్నపల్లి గ్రామంలో రైతుల చేలలోకి వెళ్లేందుకు రోడ్డు పనులు చేస్తున్నారు. మల్కాపూర్, తదితర గ్రామాల్లో ఫారం పాండ్స్, బోయినపల్లిలో ల్యాండ్ లెవలింగ్ పనులు చేస్తున్నట్లు తెలిపారు. కూలీలకు రోజుకు రూ.170 వరకు కూలి గిట్టుబాటవుతోందని అధికారులు చెబుతున్నారు. ఏప్రిల్‌లో మంజూరైన పనులకు మాత్రమే పెరిగిన కూలి రూ.272 వస్తుందని ఈజీఎస్ ఏపీవో సబిత తెలిపారు. కాగా గ్రామానికి సుమారు వంద మంది వరకు కూలీలు పనులకు వస్తున్నట్లు తెలిపారు.

చెరువులో మట్టి తీస్తున్నం



గ్రామంలోని చెరువులో పూడిక మట్టి తీసే పనులు చేస్తున్నాం. సుమారు 130 మంది వరకు రోజు ఉదయం 6.30 నుంచి 11 గంటల వరకు పనులు చేస్తున్నాం. రోజుకు సుమారు రూ. 170 వరకు కూలి వస్తోంది. ఎండ తగలకముందే పనులు పూర్తిచేసి ఇంటికి చేరుకుంటున్నాం. – నుంకని జల, బోయినపల్లి

కూలి గిట్టుబాటవుతోంది



ఊళ్లలో ఎండలకు పొద్దంతా పని చేయలేం. ఉపాధిహామీ పథకం పనులు పొద్దుగాల పోయి చేస్తున్నం. చెరువులో మట్టి తీసి ట్రాక్టర్ల పోస్తున్నం. ఉపాధి పని కూలీ మాకు గిట్టుబాటు అవుతోంది. రోజుకు రూ.170 వరకు రావడంతో పొట్ట గడుస్తోంది.

– బోయిని లింగయ్య, బోయినపల్లి

మెజార్టీ గ్రామాల్లో పనులు



ఈ వేసవిలో 21 గ్రామాల్లో రోజుకు సుమారు 1200 మంది కూలీలకు పనులు కల్పిస్తున్నాం. 7 వేలకు పైగా కూలీలకు జాబ్‌కార్డులు ఉన్నాయి. వీటిలో సుమారు 4 వేల మంది పనులకు వస్తారు. ఫిష్, ఫామ్ పాండ్స్, గ్రావెల్ రోడ్డు పనులు జరుగుతున్నాయి.

– వనం సబిత, ఈజీఎస్ ఏపీవో, బోయినపల్లి

చిత్రకథ



తలుపులు లేని పంచాయతీ భవనం

కోనరావుపేట: సాధారణంగా ఏ భవనానికైనా తలుపులు, గేటు ఉంటాయి. కానీ కోనరావుపేట మండలం మంగళ్లపల్లి గ్రామపంచాయతీ భవనానికి తలుపులు లేకుండా రెండేళ్లుగా పాలన సాగుతోంది. ఉపాధి హామీ నిధులు రూ.13 లక్షలతో నిర్మించిన ఈ భవనాన్ని 2016 డిసెంబర్ 3న ప్రారంభించారు. తర్వాత కొన్ని రోజులు వినియోగించకపోవడంతో భవనం శిథిలావస్థకు చేరి, పగుళ్లు బారింది. తలుపులు చెదలు పట్టిపోయాయి. రెండేళ్ల నుంచి ఇదే భవనంలో పాలన సాగిస్తున్నారు.

ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్ తొలగింపు

సాక్షి ఎఫెక్ట్

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని పెద్దబడి పక్కన ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి అధికారులు వేరే చోటుకు మార్చారు. విద్యార్థులకు పొంచి ఉన్న ప్రమాదం అనే శీర్షికతో ఇటీవల సాక్షిలో వచ్చిన కథనానికి సెస్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు.



తొలగించిన ప్రదేశం

కార్యక్రమంలో సెస్ ఏఈ దివ్య, మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాల్‌రాజ్‌యాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పల్లె పల్లెలో బడిబాట



వేములవాడరూరల్: తిప్పాపూర్‌లో..

వేములవాడరూరల్/చందుర్తి/గంభీరావుపేట/ ఎల్లారెడ్డిపేట: జిల్లాలో బడిబాట కార్యక్రమం ఊపందుకుంది. మంగళవారం వేములవాడ మండలంలోని తిప్పాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నుంచి బడిబాట కార్యక్రమాన్ని ఎంఈవో బన్నాజీ ప్రారంభించారు. చందుర్తి ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విక్కుర్తి లక్ష్మీనారాయణ, బోయిన్‌పల్లి తిరుపతి, గంభీరావుపేట మండలంలోని దమ్మన్నపేటలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోయన్నగారి నారాయణ, నాగంపేట జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఇదిలా ఉండగా ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్, అంబేడ్కర్‌నగర్‌లో బడిబాట నిర్వహించగా, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు ఉపాధి కూలీల వద్దకు వారి పిల్లలను సర్కార్ బడుల్లో చేర్పించాలని కోరారు.



గంభీరావుపేట: దమ్మన్నపేటలో..



హరిదాస్‌నగర్‌లో..



చందుర్తిలో..

నియామకం

బీసీ సంక్షేమ సంఘం కమిటీ

వేములవాడరూరల్: రుద్రవరం గ్రామ బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా నేరెళ్ల బాలయ్య, ఉపాధ్యక్షుడిగా రాదారపు వెంకటేశ్, ప్రధాన కార్యదర్శిగా మొగులోజు నర్సయ్య, కార్యదర్శిగా పిల్లి శ్రీకాంత్, అధికార ప్రతినిధి గొల్లపల్లి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా పల్లి శంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నియామకానికి జిల్లా అధ్యక్షుడు మహేందర్‌యాదవ్, ఉపాధ్యక్షుడు కాసర్ల అరుణ్‌కుమార్, గుండెకార్ల లక్ష్మణ్, మైలారం మహేశ్ హాజరయ్యారు.

లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్‌గా రఘుపతి రావు

రుద్రంగి: మండల లయన్స్ క్లబ్ సభ్యుడు గడప రఘుపతిరావును 2023–24 సంవత్సర జోన్ చైర్మన్‌గా నియమించినట్లు జిల్లా గవర్నర్ హన్మండ్ల రాజిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఏడేళ్లుగా చేపట్టిన సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా రుద్రంగి క్లబ్ నుంచి చైర్మన్ ఎన్నిక చేసినట్లు తెలిపారు. చైర్మన్‌గా నియమించిన రాజిరెడ్డికి రఘుపతిరావు కృతజ్ఞతలు తెలియజేశారు. రుద్రంగి క్లబ్ సభ్యులు తీపిరెడ్డి వెంకట్‌రెడ్డి, కర్ణవత్తుల దేవేందర్, హిరోజి రఘుపతిరావును అభినందించారు.

పేద విద్యార్థులకు అండగా..



నగదు పురస్కారాన్ని అందిస్తున్న ట్రస్టు సభ్యులు

ముస్తాబాద్: పేద విద్యార్థులకు అండగా తస్లీమా అంజూమాన్ చారిటబుల్ ట్రస్టు అండగా ఉంటుందని ట్రస్టు చైర్మన్ ఎండీ నవాజ్ అన్నారు. ముస్తాబాద్‌లో మంగళవారం ట్రస్టును ప్రారంభించిన సందర్భంగా పదో తరగతిలో టాపర్లుగా నిలిచిన పది మంది విద్యార్థులకు రూ.50 వేల నగదు పురస్కారాలను అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ గోపాల్‌రావు, సుమతి, విజయ, రాంరావు, సర్వర్, షాదుల్, ఖాజా, నజీర్, బాలయ్య, అన్వర్, భరత్, సమీర్, ముబిన్, నాయిం, రషీద్ పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేని ట్రాక్టర్ల తనిఖీ

తంగళ్లపల్లి: మండల కేంద్రంలో మంగళవారం ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నంబర్ ప్లేట్ లేకుండా, నంబర్ ప్లేట్ తీసేసి ప్రయాణిస్తున్న ట్రాక్టర్లను గుర్తించారు. నంబర్ ప్లేట్ లేని ట్రాక్టర్లకు అప్పటికప్పుడు పేయింటర్ ద్వారా నంబర్ ప్లేట్లు రాయించారు. నిబంధనలకు అనుగుణంగా ట్రాక్టర్లు నడపాలని లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యారన్ సబ్సిడీ చెల్లించాలి

సిరిసిల్లటౌన్: బతుకమ్మ చీరలకు సంబంధించి పవర్‌లూమ్ కార్మికులకు యారన్ సబ్సిడీ చెల్లించాలని పవర్‌లూమ్ వర్కర్ యూనియన్ నాయకుడు కోడం రమణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కార్మికులకు వర్కర్ టూ ఓనర్ పథకాన్ని అమలు చేయాలన్నారు. యారన్ సబ్సిడీని చెల్లించడంలో అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని దీనిని నిరసిస్తూ బుధవారం స్థానిక చేనేత జౌళి శాఖ కార్యాలయం వద్ద 24 గంటల దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. ఇట్టి దీక్షను పవర్‌లూమ్ కార్మికులు విజయవంతం చేయాలని కోరారు.

మెగా జాబ్‌మేళాకు స్పందన

- 55 కంపెనీల్లో 700 మందికి ఉద్యోగాలు

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల పట్టణంలోని వికాస్ డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో స్థానిక పద్మానాయక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. జిల్లా నలుమూల నుంచి దాదాపు 2,500 మంది పైగా నిరుద్యోగ యువత హాజరయ్యారు. 55కు పైగా జాతీయ, బహుళ జాతీయ కంపెనీలు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీరిలో 700 మందికిపైగా నిరుద్యోగులు ఆయా కంపెనీల్లో ఉద్యోగాలు పొందారు. ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాలను జారీ చేశారు. కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ సంకసాల మల్లేశ్, ఎస్పీ అఖిల్ మహాజన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చీటి నర్సింగారావు, కళాశాల యాజమాన్యం దిడ్డి శ్రీనివాస్, గుగ్గిళ్ల జగన్‌గౌడ్, అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



జాబ్ మేళాకు హాజరైన విద్యార్థులు

హామీలను విస్మరించిన సీఎం కేసీఆర్

- కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి

గంభీరావుపేట: హామీలు ఇచ్చి వాటిని విస్మరించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని దేశాయిపేట గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ జెండా పండుగ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీకి కృతజ్ఞతా భావంతో రాబోయే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టబోతున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో అన్నీ తానై ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తే తన కొడుకు రాజకీయ భవిష్యత్ కోసం తన రాజకీయ జీవితాన్ని బలికొన్న ఘనత కేసీఆర్‌ది అన్నారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఈ సందర్భంగా పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు హమీద్, ఎంపీటీసీ పర్ష రాములు, జిల్లా కార్యదర్శి తిరుపతిగౌడ్, మాజీ ఎంపీటీసీ నాగయ్య, నాయకులు పాల్గొన్నారు.

రంగం చెరువు కోసం పోరాడుతాం

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామంలోని రంగం చెరువును మాయం చేసి కుంటగా మార్చారని, దాని కోసం తాము పోరాటం చేస్తామని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిఅన్నారు. ఈ సందర్భంగా రంగం చెరువును పరిశీలించి ఆక్రమణకు గురైన విధానాన్ని గ్రామస్తుల ద్వారా తెలుసుకున్నారు. కొంత మంది బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సామాజిక సేవా ముసుగులో రంగం చెరువును ఆక్రమించేందుకు భూమిని చదును చేశారన్నారు. కార్యక్రమంలోడీసీసీ ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, మండల శాఖ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.



గంభీరావుపేట: జెండావిష్కరణలో పాల్గొన్న కేకే

చెక్కుల పంపిణీ

తంగళ్లపల్లి: మండలంలోని ఇందిరమ్మకాలనీ గ్రామపంచాయతీ పరిధిలో మంగళవారం సర్పంచ్ బైరి శ్రీవాణి ఆధ్వర్యంలో పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అల్వాల సాయిరాం, కార్యదర్శి సలీం, ఆర్ఐ మధు, వార్డు సభ్యులు, పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు బైరి రమేశ్ పాల్గొన్నారు.

పరామర్శ

తంగళ్లపల్లి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మండల బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి గనప మధన్‌రెడ్డిని మంగళవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగారావు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు వల్లకొండ వేణుగోపాలరావు తోకలిసి పరామర్శించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

బోయినపల్లి: రక్తదానం ప్రాణదానంతో సమానమని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు జోగినిపల్లి రవీందర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని కొదురుపాక రైతువేదికలో బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. బీఆర్‌ఎస్‌వీ శాఖ యువకులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడంపై అభినందనలు తెలిపారు. అనంతరం గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ, తహసీల్దార్ దర్పెల్లి నరేశ్, గంగాధర ఎస్సై పుల్లా అభిలాష్, ఏఎంసీ చైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డి, వైస్‌ఎంపీపీ నాగయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, బీఆర్‌ఎస్‌వీ మండల అధ్యక్షుడు వరుణ్‌సందేశ్, సర్పంచులు, ఎంపీటీసీలు, ఏఎంసీ డైరెక్టర్లు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో రవీందర్‌రావు

మురుగు నీటి కాలువను శుభ్రం చేయాలి



కాలువను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణంలోని ప్రధాన మురుగు నీటి కాలువను శుభ్రం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. మురుగు నీటి కాలువను మంగళవారం పరిశీలించి మాట్లాడారు. పారిశుధ్య నిర్వహణ లోపంతో ప్లాస్టిక్ వ్యర్థాలతో కాలువ నిండిందన్నారు. దీని వల్ల దోమలు పెరిగి పరిసరాల్లో నివసిస్తున్న ప్రజల ఆనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. స్వచ్ఛ షేహరా అవార్డు కేవలం పేపర్‌కే పరిమితమా అని ఎద్దేవా చేశారు. పంతం రవి, నాగరాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన

ఇల్లంతకుంట: మండలంలోని నర్సక్కపేట, జవారిపేట, పాత్తూరు గ్రామాల్లో హరిత నర్సరీలను ఏపీవో చంద్రయ్య మంగళవారం పరిశీలించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 19న ప్రభుత్వం హరితహారం కార్యక్రమం ప్రారంభిస్తుందని, అన్ని గ్రామాల్లో మొక్కలు తప్పనిసరిగా నాటే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి



తంగళ్లపల్లి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎంపీపీ పడిగెల మానస అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. 8న చెరువుల పండగ, 15న జాతీయ జెండాను ఆవిష్కరణ, 19న తెలంగాణ హరిత దినోత్సవం, 22న తెలంగాణ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.లచ్చాలు, ఇన్‌చార్జి ఎంపీవో విజేందర్‌రెడ్డి, డీటీ దివ్య, ఏపీవో నాగరాజు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

వీర్నపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 8న జరుగు చెరువుల పండుగ కార్యక్రమన్ని విజయవంతం చేయాలని ఇరిగేషన్ డీఈఈ వినోద్ కుమార్ మంగళవారం అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని అన్నారు. అనంతరం ఊరూర చెరువుల పండుగ పోస్టర్లు ఆవిష్కరించారు. ఎంఆర్‌వో తఫాజుల్ హుస్సేన్, ఎంపీడీవో నరేశ్, డీటీ ప్రవీణ్‌కుమార్, ఏఈ సురేశ్, ఏపీవో శ్రీహరి, బంజారా సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి సురేశ్ నాయక్ పాల్గొన్నారు.

అధ్యాపకుల విస్తృత ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న అధ్యాపకులు

గంభీరావుపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలు పెంచేందుకు ప్రిన్సిపాల్, అధ్యాపకులు మండలంలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది మెరుగైన ఫలితాలు సాధించిన నేపథ్యంలో ఇంటింటికి వెళ్లి కళాశాలలో సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరిస్తూ, ప్రవేశాలు పొందుతున్న వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. గ్రామాల వారీగా పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల వివరాలు సేకరిస్తున్నారు. కళాశాలలో వసతులు, అధ్యాపకుల అనుభవం, బోధనా విధానం, మధ్యాహ్న భోజనం, ఉపకార వేతనాలు, ఉచిత పాఠ్యపుస్తకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులు బోధిస్తున్న ఈ కళాశాలలో గతేడాది 37 శాతం ఫలితాలు సాధించగా ఈ ఏడాది 94 శాతం ఫలితాలు సాధించిన విషయాన్ని ప్రధానంగా అధ్యాపకులు విస్తృత ప్రచారం చేస్తున్నారు.